క్లుప్తంగా

ఘనంగా మన్యుసూక్త హోమం


హోమం నిర్వహిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం మన్యు సూక్త హోమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా అర్చకులు ఆలయ యాగశాలలో ముందుగా స్వామివారి ఉత్సవ మూర్తికి ప్రత్యేక పూజలు చేశారు అనంతరం మన్యుసూక్తహోమాన్ని నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

నెట్టికంటుడిని దర్శించుకున్న డీఆర్‌ఎం


డీఆర్‌ఎంకు తీర్థప్రసాదాలను అందజేస్తున్న అర్చకులు

గుంతకల్లు రూరల్: గుంటూరు రైల్వే డీఆర్‌ఎం ఎం.రామకృష్ణ దంపతులు మంగళవారం ఉదయం కసాపురం నెట్టికంటి ఆంజనేయ స్వామిని దర్శించుకున్నారు. ముందుగా ఆయనకు ఆలయ అధికారులు, అర్చకులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో స్వామికి డీఆర్‌ఎం కుటుంబ సభ్యుల పేరున ప్రత్యేక పూజలు నిర్వహించిన అర్చకులు వారికి తీర్థప్రసాదాలను అందజేశారు.

ధైర్యంగా ఉండండి.. పార్టీ అండగా ఉంటుంది


మాట్లాడుతున్న యువ నాయకుడు భీమిరెడ్డి

గుంతకల్లు రూరల్: కూటమి ప్రభుత్వం కొలువుదీరినప్పటి నుంచి మండలంలోని చింతలాంపల్లిలో టీడీపీ నాయకుల ఆరాచకాలు పెరిగాయని, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ధైర్యంగా ఉండాలని, పార్టీ అండగా ఉంటుందని యువనాయకుడు భీమిరెడ్డి భరోసా ఇచ్చారు. గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త బండయ్యను పోలీసులు కొట్టిన విషయం తెలుసుకున్న ఆయన మంగళవారం ఉదయాన్నే గ్రామానికి చేరుకొని పార్టీ కార్యకర్తలను పరామర్శించారు. గ్రామంలో టీడీపీ నాయకులు సృష్టిస్తున్న ఆలజడులను కార్యకర్తలు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుతం రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందన్నారు. త్వరలోనే మనకు మంచి రోజులు వస్తాయని, అంతవరకూ ఓపికతో ఉండాలని సూచించారు. కార్యకర్తలకు పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించుకోవాలన్నారు.

అంకాలమ్మ, కుంటెమ్మ ఆలయంలో 'దేవర'

పామిడి: పట్టణంలోని కొండూరురోడ్డులో వెలిసిన అంకాలమ్మ, కుంటెమ్మ ఆలయంలో గ్రామస్తుల ఆధ్వర్యంలో దేవర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి నాగన్న ఆధ్వర్యంలో అంకాలమ్మ, కుంటెమ్మ దేవతామూర్తులను శోభాయానంగా అలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు. మూగజీవాలకు బలిపూజలు నిర్వహించారు. అనంతరం వెయ్యిమందికి మాంసాహార భోజనాలను ఏర్పాటు చేసి ఆనందోత్సాహాల నడుమ దేవర చేశారు.

హామీలు అమలు చేయాలి


ఏడీఈ నాగేంద్రకు వినతిపత్రం ఇస్తున్న సీఐటీయూ నాయకులు

గుంతకల్లుటౌన్: విద్యుత్‌శాఖలో పనిచేస్తున్న నాన్ రెగ్యులర్ ఉద్యోగ, కార్మికులను రెగ్యులర్ చేస్తామని, తగిన పీఆర్సీ అందిస్తామని ఎన్నికలకు ముందు కూటమి నేతలు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ట్రాన్స్‌కో ఏడీఈ నాగేంద్రను సీఐటీయూ నాయకులు కోరారు. మంగళవారం ట్రాన్స్‌కో ఏడీఈని సీఐటీయూ పట్టణ కార్యదర్శి సాకేనాగరాజు, ఎస్.కె.ఎం.బాషా తదితరులు కలిసి వినతిపత్రం అందజేశారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, స్టోర్ హమాలీస్ నాన్ రెగ్యులర్ ఉద్యోగుల, బిల్ కలెక్టర్లు, మీటర్ రీడర్స్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని విన్నవించారు. కార్యక్రమంలో సీఐటీయూ అధ్యక్షుడు జగదీష్, వన్నూరప్ప, పీరా, రాజు తదితరులు పాల్గొన్నారు.

పనిముట్లు ఇవ్వకుండా పనులెలా?

- అరకొర పనిముట్లతో పారిశుధ్య పనుల నిర్వహణ
- కార్మికులకు చీపుర్లు, సబ్బులు, కొబ్బరినూనె ఇవ్వలేని దుస్థితి


గుంతకల్లులో రోడ్డు శుభ్రం చేస్తున్న పారిశుధ్య కార్మికులు

మునిసిపాలిటీ: గుంతకల్లు
వార్డులు: 37
జనాభా 1.50 లక్షలకు పైగా

గుంతకల్లుటౌన్: ప్రజలంతా నిద్రిస్తున్న వేళ పారిశుధ్య కార్మికులు మేల్కొంటారు. తెల్లారేసరికి చెత్తాచెదారంతో నిండిన రోడ్లన్నీ శుభ్రం చేస్తారు. వాళ్లు ఒక్కరోజు విశ్రాంతి తీసుకుంటే పట్టణం చెత్తకుప్పలా మారిపోతుంది. దుమ్ముధూళి, కంపును లెక్కచేయకుండా ప్రజల ఆరోగ్యాలను కాపాడుతున్న ఆరోగ్యప్రదాతలైన పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో గుంతకల్లు మున్సిపల్ అధికార యంత్రాంగం విఫలమైంది. స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలపై విస్తృత ప్రచారం చేస్తున్న పాలకులు చీపుర్లు పట్టుకుని ఫోటోలకు ఫోజులిస్తున్నారే తప్ప పీహెచ్ వర్కర్ల గురించి పట్టించుకోవడం లేదు. సెలెక్షన్ గ్రేడ్ హోదా కలిగిన గుంతకల్లు మున్సిపాలిటీ పరిధిలో రోజూ 67 టన్నుల చెత్త ఉత్పత్తవుతోంది. పారిశుధ్య నిర్వహణకు ప్రభుత్వం మంజూరు చేసిన 146 రెగ్యులర్ పీహెచ్ వర్కర్ల పోస్టుల్లో 56 మంది పదవీ విరమణ పొందగా ప్రస్తుతం 90 మంది పనిచేస్తున్నారు. రిటైర్డ్ అయిన వారి స్థానంలో కొత్తగా నియామకాలు చేపట్టలేదు. ఔట్‌సోర్సింగ్ పద్ధతిన 126 పోస్టులకు గానూ 121 మంది పనిచేస్తున్నారు. పెరిగిన పట్టణ విస్తీర్ణం, జనాభా ప్రకారం డివిజన్‌కు అదనంగా కార్మికులను నియమించని కారణంగా ప్రస్తుతం పనిచేస్తున్న కార్మికులపై తీవ్ర పనిఒత్తిడి పెరిగింది.

సబ్బులు, కొబ్బరినూనె, పాదరక్షలివ్వలేని దుస్థితి..

మున్సిపల్ కార్మికులకు ఏటా రెండు జతల యూనిఫామ్‌లివ్వాలి. అలాగే ఒక్కొక్కరికి ఏడాదికి 12 సబ్బులు, నెలకు 250 మి.లీ కొబ్బరి నూనె, రెండు జతల పాదరక్షలు ఇవ్వాలి. అధికారుల నిర్లక్ష్యం కారణంగా రెండేళ్లుగా వీటిని కార్మికులకివ్వలేదు. వాటి కోసం కార్మికులు నిత్యం ఆందోళనలు చేపడుతున్నప్పటికీ అధికారులు చెవికెక్కించుకోవడం లేదు. పాలకులు, అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

చీపుర్లకూ దిక్కు లేదు..



విధి నిర్వహణలో భాగంగా రోడ్లు ఊడ్చే కార్మికులకు నెలకు మూడు చీపుర్లు, కాలువ పారలు, చెత్తను ఎత్తే టబ్బులు, పూడికను ఎత్తేసే గోలాలు కూడా సక్రమంగా ఇవ్వలేని దుస్థితి. ఇక కరోనా సమయంలో గ్లౌజులిచ్చారే తప్ప అప్పటి నుంచి అతీగతీ లేదు. మెయిన్‌రోడ్డును ఊడ్చే వారికి మూడు చీపుర్లు ఇచ్చి, మిగిలిన వారికి ఐదారు నెలలుగా రెండు చీపుర్లు ఇస్తే ఎలా ఊడ్చాలని కార్మికులు ప్రశ్నిస్తున్నారు. ఇక చెత్తను తీసుకెళ్లే తోపుడు బండ్లు 89 వరకు ఉన్నప్పటికీ వాటిలో కొన్ని మరమ్మతులకు నోచుకోలేదు. పనిముట్లే ఇవ్వకపోతే పనులు ఎలా చేయాలని కార్మిక నాయకులు నిలదీస్తున్నారు.

యూనిఫాం ఇచ్చేందుకు చర్యలు



పెరిగిన పట్టణ విస్తీర్ణం, జనాభాకు తోడు పారిశుద్ధ్య కార్మికుల కొరత కారణంగా ప్రస్తుతం పనిచేస్తున్న వారిపై కొంత పని భారం పెరిగిన మాట వాస్తవమే. రిటైర్డ్ అయిన కార్మికుల స్థానంలో కొత్తవారి నియామకం చేపట్టలేదు. కార్మికులకు ఇవ్వాల్సిన యూనిఫామ్‌లు, సబ్బులు, కొబ్బరినూనె తదితర వాటిని త్వరలో ఇచ్చేందుకు ఉన్నతాధికారులు చర్యలు చేపడుతున్నారు. తోపుడు బండ్లు, అవసరమైనన్ని పనిముట్లు సమకూరుస్తాం.
–హరినాథ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, గుంతకల్లు

కార్మికులపై చులకనభావం వీడాలి



పట్టణాన్ని శుభ్రంగా ఉంచడంలో రాత్రింబవళ్లు పనిచేసే పారిశుద్ధ్య కార్మికులకు అవసరమైన పనిముట్లు ఇవ్వకపోతే పనులెలా చేయాలి? సబ్బులు, పాదరక్షలు, కొబ్బరి నూనె గురించి అడిగి అడిగి విసిగిపోయాం. పారిశుద్ధ్య కార్మికుల పట్ల అధికారులు చులకన భావాన్ని వీడాలి. గత వైఎస్సార్ ప్రభుత్వ హయాంలో చెత్తసేకరణకు క్లాప్ ఆటోలు తిరిగేవి. వాటిని నిలుపుదల చేయడం వల్ల కార్మికులపై తీవ్ర పనిభారం పెరిగింది.
– నరసయ్య, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు

'అన్నదాత సుఖీభవ' ఎప్పుడిస్తారు?


మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా కార్యదర్శి మల్లికార్జున

పుట్లూరు: ఎన్నికలకు ముందు రైతులకు ఏటా రూ.20వేలు ఇస్తామని చెప్పిన అన్నదాత సుఖీభవ పథకం ఎప్పుడు అమలు చేస్తారని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి మల్లికార్జున ప్రశ్నించారు. మంగళవారం మండలకేంద్రంలోని పాత పశు వైద్యశాల ప్రాంగణంలో నిర్వహించిన రైతు సంఘం మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి వస్తే రైతులకు గత ప్రభుత్వం కంటే మిన్నగా చేస్తామన్న కూటమి నాయకుల హామీలు ఏమైయ్యాయన్నారు. ఈ ఏడాది ఖరీఫ్, రబీ సీజన్లలో రైతులు తీవ్రంగా నష్టపోయారని, పప్పుశనగ పంట కోసం పెట్టిన పెట్టుబడులు చేతికందని దుస్థితి ఏర్పడిందన్నారు. బీమా అందించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం మండల రైతు సంఘం కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రామాంజినేయులు, సత్తార్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

అదనపు బస్సులు నడపాలి

గుంతకల్లుటౌన్: గుత్తి, అనంతపురం మీదుగా తిరుపతికి రోజూ అదనపు బస్సు సర్వీసులను నడపాలని డీవైఎఫ్‌ఐ నాయకులు కోరారు. మంగళవారం ఆర్టీసీ డిపో మేనేజర్ కె.వి.గంగాధర్‌ను డీవైఎఫ్‌ఐ పట్టణ ప్రధాన కార్యదర్శి సురేంద్ర, ఎస్‌ఎఫ్‌ఐ మాజీ రాష్ట్ర కార్యదర్శి రమేష్ తదితరులు కలిసి వినతిపత్రం అందజేశారు. యూపీలో కుంభమేళా జరుగుతున్న సందర్భంగా రైల్వే శాఖ గుంతకల్లు నుంచి తిరుపతికి వెళ్లే ప్యాసింజర్ రైళ్లను రద్దు చేసి అక్కడికి పంపడం వల్ల అనంతపురం, తిరుపతికి వెళ్లాలంటే ఉద్యోగులు, విద్యార్థులతో పాటు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని నాయకులు వివరించారు. ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని అదనపు సర్వీసులను నడపాలని విన్నవించారు.డీవైఎఫ్‌ఐ నాయకులు షాషా, సూరి, రాము, బాలు, మంజు, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన


దివ్యాంగుడి పింఛన్ ధ్రువీకరణ పత్రాలను పరిశీలిస్తున్న వైద్య బృందం

యాడికి: మండల వ్యాప్తంగా మంచానికే పరిమితమైన 58 మంది దివ్యాంగుల ధ్రువీకరణ పత్రాలను అనంతపురం, కర్నూలుకు చెందిన వైద్యం బృందం పరిశీలించారని ఎంపీడీఓ వీర్రాజు తెలిపారు. మంగళవారం మండలంలోని యాడికి పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో 38 పింఛన్లను అనంతపురం, కర్నూలు వైద్యులు సాగర్, రామయ్య, అమర్‌నాథ్ బృందం, రాయలచెరువు పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో ఉన్న 20 పింఛన్లను అనంతపురానికి చెందిన రవి ప్రకాష్, కర్నూలు ఎస్తేజా రాణి వైద్య బృందం స్థానిక సచివాలయ సిబ్బందితో కలసి ఇంటింటికీ వెళ్లి పింఛన్‌దారుల వేలిముద్రలు, పింఛన్ ధ్రువీకరణ పత్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కార్యాలయ ఏఓ నాగేశ్వర రెడ్డి, యాడికి, రాయలచెరువు పీహెచ్‌సీ వైద్యులు పరమేశ్వర, అప్పయ్య, దేవరాజన్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

గుత్తి కోటపై అవగాహన

గుత్తి: పట్టణంలోని కోట కేశవ పిళ్లై ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షుడు విజయ భాస్కర్ ఆధ్వర్యంలో గుత్తి కోటపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వీఆర్వోల సంఘం జిల్లా కార్యదర్శి నాగరాజు, హెచ్‌ఎం సుబహాన్‌తో కలసి ఆయన మాట్లాడారు. గుత్తి కోటను ప్రతి ఒక్కరూ సందర్శించాలన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ ఆఫీసర్‌కు జాతీయ అవార్డు


చిన్న పుల్లయ్య

బుక్కరాయసముద్రం: మండలంలోని రోటరీపురంలో ఉన్న ఎస్‌ఆర్‌ఐటీ (అటానమస్) ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ పోగ్రాం ఆఫీసర్‌గా పనిచేస్తున్న చిన్న పుల్లయ్య నేషనల్ ప్రేరణ దూత్ 2024–25 అవార్డుకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ డాక్టర్ బాలక్రిష్ణ మంగళవారం తెలిపారు. జాతీయ స్థాయి సేవా విభాగంలో విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించడంలోనిష్ణాతులైన వ్యక్తులకు ఈ అవార్డును అందజేస్తారన్నారు. ఈ అవార్డును ఫిబ్రవరి-3న బీహార్‌లోని చాప్రా పట్టణంలోని పేస్ ఆఫ్ ఫ్యూచర్ ఇండియా వారు నిర్వహించే కార్యక్రమంలో ఆయనకు అందజేస్తారన్నారు. చిన్న పుల్లయ్యను కళాశాల యాజమాన్యం అభినందించారు.

అగ్ని ప్రమాదంలో మునగ చెట్ల దగ్ధం

గార్లదిన్నె: మండల కేంద్రం సమీపంలోని పొలంలో మంగళవారం అగ్ని ప్రమాదంలో మునగ చెట్లు కాలి బూడిదయ్యాయి. పోలీసుల వివరాల మేరకు....డాక్టర్ మురళీకృష్ణకు చెందిన వ్యవసాయ తోటకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో, అర్ధ ఎకరాలో సాగు చేసిన మునగ పంటతో పాటు, డ్రిప్పు పైపులు కాలి బూడిదయ్యాయి. రూ.2లక్షలు నష్ట పోయినట్లు బాధితుడు వాపోయాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ గౌస్‌మొద్దీన్ తెలిపారు.

రెండు నెలల దూడకు శస్త్రచికిత్స

గార్లదిన్నె: మండలంలోని ముకుందాపురంలో రైతు నారాయణస్వామికి చెందిన రెండు నెలల దూడకు పశు సంవర్ధక శాఖ అధికారులు శస్త్ర చికిత్స చేశారు. నాలుగు రోజులుగా మూత్ర విసర్జన చేయలేక ఎనుము దూడ ఇబ్బంది పడుతుంటే రైతు యర్రగుంట్ల పశువైద్యాధికారి ఆంజనేయులును సంప్రదించగా.. ఆయన శింగనమల పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు డాక్టర్ పద్మనాభంకు రెఫర్ చేశారు. ఆయన దూడను పరీక్షించి మూత్రశయం పగిలిపోవడాన్ని గుర్తించి ఆపరేషన్ చేసి కడుపులో ఉన్న ఏడు లీటర్ల మూత్రం బయటకు తీశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది రంగనాయకమ్మ, చంద్రశేఖర్, ప్రసన్న, తదితరులు పాల్గొన్నారు.

ఏఐఎస్‌ఎఫ్ నాయకులపై కేసు

గుంతకల్లు రూరల్: పట్టణ శివారులోని ఆయుష్ కళాశాలలో ఫర్నీచర్ ధ్వంసం చేసిన కారణంగా ఏఐఎస్‌ఎఫ్ నాయకులపై కేసు నమోదు చేసినట్లు మంగళవారం రూరల్ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. కళాశాలలో అక్రమంగా ఫీజులు వసూలు చేస్తున్నారంటూ ఏఐఎస్‌ఎఫ్ నాయకులు సోమవారం, మంగళవారంకళాశాల వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్‌ఎఫ్ నాయకులు కళాశాలలోని ఫర్నీచర్‌ను ధ్వంసం చేసినట్లు యాజమాన్యం ఫిర్యాదు ఇవ్వడంతో వెంకట్‌నాయక్, వినోద్‌కుమార్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

కంటి వైద్యశిబిరానికి స్పందన

గుంతకల్లుటౌన్: పాతగుంతకల్లులోని శ్రీవిద్యారణ్య ఇంగ్లిష్ మీడియం స్కూల్ ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. ఎల్‌వీ.ప్రసాద్ కంటి ఆస్పత్రి వైద్య సిబ్బంది 256 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 80 మందికి ఫిబ్రవరి 4,5 తేదీల్లో బళ్లారిలోని ఆస్పత్రిలో కంటి ఆపరేషన్లు చేయించనున్నట్లు కరస్పాండెంట్ మంజుల వెంకటేష్, ప్రిన్సిపాల్ కళావతి తెలిపారు. మేస్త్రీ దొడ్డప్ప, బండారు కృష్ణమూర్తి, శేఖన్న, ఇంజినీర్ సత్యబాబు, ప్రదీప్‌ఆచారి, శ్రీదేవి, ఆ నలుగురు సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా మసూద్ గాజీ ఉరుసు


శింగనమలలో గంధం ఊరేగిస్తున్న దృశ్యం


ఫకీర్ల విన్యాసాలు

శింగనమల: మండల కేంద్రంలో మసూద్ గాజీ ఉరుసు మంగళవారం వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున 1.30 గంటలకు గంధం ఊరేగింపు ప్రారంభించారు. కట్టె సాము, ఫక్కీర్ల విన్యాసాలు, మంగళ వాయిద్యాలు, బాణా సంచాలు కాల్చుతూ ఊరేగించారు. తెల్లవారుజామున ఆరు గంటలకు గంధం ఊరేగింపుగా దర్గాలోకి తీసుకు వచ్చారు. అక్కడ ప్రార్థనలు చేశారు. అనంతరం ఉరుసు నిర్వహించారు. ఈసందర్భంగా భక్తులు మొక్కుబడులు చెల్లించారు. కందురోత్సవం కార్యక్రమం నిర్వహించారు. శింగనమల మండలంతోపాటు బుక్కరాయసముద్రం, తాడిపత్రి, అనంతపురం, ఉరవకొండ, గుంతకల్లు, బెంగుళూరు ప్రాంతాంల నుంచి భక్తులు తరలివచ్చారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. రాత్రి గొప్ప ఖవ్వాలి పోటీ నిర్వహించారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ కౌలుట్లయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక బందోబస్తు చేపట్టారు. అలాగే ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం దర్గా ముజావర్ అబ్దుల్ ఖదీర్ , కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను సన్మానించారు.

డ్రైవర్లు అప్రమత్తంగా వ్యవహరించాలి


మాట్లాడుతున్న ఎంవీఐ, వన్‌టౌన్ సీఐ

గుంతకల్లు: ప్రైవేట్ స్కూల్ బస్సు డ్రైవర్లు అప్రమత్తంగా వ్యవహరిస్తూ విద్యార్థులను గమ్యస్థానాలకు చేర్చాలని ఎంవీఐ నీలం వెంకటరాజాబాబు, వన్‌టౌన్ సీఐ బి.మనోహర్ సూచించారు. జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా మంగళవారం పట్టణంలోని ప్రైవేట్ స్కూల్స్ బస్సుల డ్రైవర్లు, క్లీనర్లతోపాటు ఆటో డ్రైవర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ రోజూ స్కూల్ బస్సు బయలుదేరే ముందు కండీషన్ పరిశీలించాలన్నారు. విద్యార్థులు బస్సులోకి ఎక్కి సీటులో కూర్చునే వరకూ కదిలించరాదన్నారు. అజాగ్రత్త వల్ల పిల్లలు కిందకు పడిపోయే ప్రమాదం ఉందన్నారు. ఇంటి నుంచి స్కూలుకు, తిరిగి ఇంటికి చేరవేడంలో జాగ్రత్త వహించాలన్నారు. డ్రైవర్లు మోటరు వాహన చట్టాలను అనుసరించినప్పుడే ప్రమాదాల నివారణకు అడ్డుకట్ట వేయవచ్చన్నారు.

చిరుత సంచారం.. అపోహ


గుడిపాడు పరిసర ప్రాంతాలను పరిశీలిస్తున్న ఫారెస్టు అధికారులు, పోలీసులు

యాడికి: గుడిపాడు సమీపంలోని సాగర్ సిమెంట్ కర్మాగారం సమీపంలో చిరుత సంచరించలేదని, అపోహలు నమ్మొద్దని గుత్తి ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ నారపరెడ్డి, యాడికి సీఐ ఈరన్న సూచించారు. మంగళవారం ఫారెస్టు సిబ్బంది, పోలీసు సిబ్బంది, గ్రామస్తులు కలసి గుడిపాడు సమీపంలోని సాగర్ సిమెంట్ కర్మాగారం పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ఎక్కడా చిరుతపులి సంచరించినట్లు ఆనవాళ్లు కనిపించలేదు. కార్యక్రమంలో ఎఫ్‌బీఓ మాధవి, ఏబీఓ చంద్రశేఖర్, తిమ్మప్ప, యాడికి పోలీసులు, సాగర్ సిమెంట్ సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

పుట్లూరు: అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ నాయకుడు సూరి డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని కడవకల్లు గ్రామంలో సెక్టార్ సమావేశానికి హాజరైన అంగన్‌వాడీ సిబ్బంది సమావేశంలో ఆయన మాట్లాడారు. అంగన్‌వాడీ సిబ్బందికి కనీస వేతనం నెలకు రూ.26 వేలు చెల్లించాలన్నారు. వారికి ఉద్యోగ భద్రత కల్పించి క్రమబద్ధీకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అంగన్‌వాడీ సిబ్బంది

విధులు సక్రమంగా నిర్వర్తించాలి: ఏఎస్పీ


మాట్లాడుతున్న ఏఎస్పీ రోహిత్‌కుమార్

పెద్దపప్పూరు: అశ్వత్థనారాయణస్వామి క్షేత్రంలో మాఘమాసం తిరునాల సందర్భంగా నాలుగు ఆదివారాల పాటు నిర్వహించే బ్రహ్మోత్సవాల్లో విధులను సక్రమంగా నిర్వర్తించాలని తాడిపత్రి ఏఎస్పీ రోహిత్‌కుమార్ సిబ్బందికి సూచించారు. మంగళవారం ఆయన అశ్వత్థక్షేత్రాన్ని సందర్శించారు. తిరునాల సందర్భంగా క్షేత్రంలోకి వాహనాలను అనుమతించకుండా.. పార్కింగ్ ప్లేస్‌లో ఉంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈఓ సుబ్రహ్మణ్యం, పెద్దవడుగూరు సీఐ రామసుబ్బయ్య, ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేత అరెస్ట్

పెద్దవడుగూరు: వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు, రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి గూడూరు సూర్యనారాయణరెడ్డిని పోలీసులు హైదరాబాద్‌లో సోమవారం రాత్రి అరెస్ట్ చేసి పెద్దవడుగూరుకు తీసుకువచ్చారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ మండల నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకొన్నారు. మంగళవారం సూర్యనారాయణరెడ్డిని ఎస్‌ఐ ఆంజనేయులు గుత్తి కోర్టులో హాజరు పరిచారు. గుత్తి జూనియర్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ బెయిల్ మంజూరు చేయడంతో ఆయనను విడుదల చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. కాగా గతంలో పంచాయతీ కార్యదర్శితో కలసి పంచాయతీ నిధులను ఆయన దుర్వినియోగం చేసినట్లు ఎంపీడీఓ నరసింహారెడ్డి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

బైక్ బోల్తా.. ఇద్దరికి గాయాలు

గుత్తి రూరల్: మండలంలోని రజాపురం గ్రామ శివారులో 67వ నంబర్ జాతీయ రహదారిపై సోమవారం రాత్రి ద్విచక్రవాహనం బోల్తా పడి ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల వివరాల మేరకు.. యాడికి మండల కేంద్రానికి చెందిన సందీప్‌కుమార్, జి.కుమార్ అనే యువకులు గుంతకల్లుకు వెళ్లారు. అక్కడ పని ముగించుకొని తిరిగి యాడికికి వెళ్తుండగా రజాపురం గ్రామ శివారులో వేగంగా వెళ్తున్న ద్విచక్ర వాహనం బోల్తా పడింది. ఘటనలో తీవ్రంగా గాయపడిన ఇద్దరినీ గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు అనంతపురానికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లక్ష్యంతో ముందుకు సాగాలి


కళాశాల వార్షికోత్సవంలో పాల్గొన్న అతిథులు

గుంతకల్లు: ప్రతి విద్యార్థీ ఓ లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకు సాగాలని ఆర్డీఓ శ్రీనివాస్ సూచించారు. మంగళవారం శ్రీ శంకరనంద గిరి స్వామి డిగ్రీ కళాశాల 41వ వార్షికోత్సవానికి ముఖ్యఅతిథులుగా ఆయనతోపాటు తహసీల్దార్ రమాదేవి, కళాశాల చైర్మన్ డీఏ మురళీకృష్ణ, కరస్పాండెంట్ కేసీ హరి, డైరెక్టర్ గోపాల్ తదితరులు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నతస్థాయికి చేరుకోవాలన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల వైస్ చైర్మన్ రంగయ్య, కోశాధికారి అశ్వర్థమ్మ, మెంబర్లు బాలయ్య, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

రోగులను సకాలంలో ఆస్పత్రులకు పంపాలి

గార్లదిన్నె: వైద్య సిబ్బంది రోగులను సకాలంలో ఆస్పత్రులకు పంపి సేవలందించాలని వ్యాధుల నిర్వహణ కార్యక్రమాల జిల్లా అధికారి డాక్టర్ నారాయణస్వామి సూచించారు. మంగళవారం ఎగువపల్లిలో నిర్వహించిన ఫ్యామిలి డాక్టర్ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. అలాగే స్థానిక అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి, రాష్ట్రీయ బాలల స్వస్థ్ కార్యక్రమం పరిశీ లించారు. గార్లదిన్నె వైద్యులు గౌతమి, మంజుల, సిబ్బంది పాల్గొన్నారు.